వోనాడు సీకట్యాళ్ల చంద్ర మా యింటికొచ్చి పిల్లి పట్టు యిడ్పిచ్చుకున్న కోడి పిల్లోలె వొణుక్కుంట నా చేతులు రొండు వట్టుకున్నది. భయంలజిక్కిన దోస్తును దగ్గరికి దీస్కోని, సన్నవిల్లోలె బుజ్జరిచ్చుకుంట 'సంగతేంది? అంట అడ్గిన. చంద్రకు చెముటలు కొత్తకుండ చెమ్మరిచ్చినట్ల గుమ్మరిస్తుండయి. నోటెంట మాట వచ్చుడె కష్ట మైనట్ల కుత్కెవడ్డట్ల ఎక్కిళ్లు వొస్తుండవి. నేనిచ్చిన గిలాసల నీళ్లు జరతాగి, సముదాన పడి నన్ను ఆనుకోని కూసుండి మొదలు వెట్టింది.

అక్కా! ఈడ నాకేందో బయమైతుండది, అంత మాయలోకమోలె, దయ్యాల నాట్కమోలె కండ్ల వడ్తుండది. మామర్దియింట్లకు సరిగ రాకుండ ఐండు, మాఆయిన దూరాన వుండె; నావెతలు ఎవరికి జెప్పుకుందు ? అటుండంగ

నేను ''చంద్రా ! దయ్యాల నాట్కవేంది ? సదువుకున్నదానివి, దయ్యెం గియ్యెం అంట బయపడకు నీకేం బుగులొద్దు, నేనుండగద ! అంటుంటె చంద్ర అందుకోని-

అక్కా !దయ్యాలంటే నిజంగ దయ్యాలు గావు; మణుసులె, మణుసులోలె నడ్సుకోకుండ, పసురాలోలె, బైరూపులోండ్లోలె, దయ్యెం బట్టిన తీర్గ నడ్సు కుంటుండరు. వోగంటకు ముందు మాయింట్ల జరిగిన ముచ్చెట నేను పుట్టిపెర్గి యింతదాన్నైనగని ఎన్నడు యిసోంటి తమాష జూడ లేదు.

అప్పుడె మాయత్త ఎప్పటి తీర్గ కలివెట్టి ఎసట్లేసి అన్నం వొండింది. సిబ్బిగట్టి గంజి పెర్సుల గంజి వార్సకుండ తప్పాలెల అత్తెసరు వెట్టివొండి దించింది. ఇంగ నేను యాడివి ఆడ సదిరి,దాలి పొయ్యిల నిప్పేసి, కుంపట్ల నుగ్గులేసి, నిప్పుకలు గుమ్మరిచ్చి, వొండెయింట్ల దీపం బెట్టి సంద్యాళ్ల అయితుండది, భవంతి బంకుల్ల దీపాలు ఎలిగిచ్చి వొస్త నంట వోయి ప్రమిదెలను, దిగూట్ల వెడ్తుండంగనె, యింటి ముంగల వోమనిషి నిండ కొప్పెర వెట్టుకోని 'అమ్మా సందె బిచ్చం తల్లీ ' అన్నడు.

పొద్దువూకంగనె తొల్తకడ్పల నిలవడ్డోణికి సందెకడి వెట్టుడు మనకు రివాజేనాయె, అందుకని నేను బిర బిర వొండెయింట్లకు నడ్సి, వుడుకుడ్కన్నం సద్ది గిన్నుల నింపుకోని బిచ్చపోనికి ఏస్తనంట వోయిన. ఇంతట్లకె ముసుగులున్న మనిషి రంతిని గొంతు గుర్తు వట్టినట్ల కడ్పలల్ల కొచ్చి పాటిచ్చి సూసింది-మాఅత్త. సూస్కం

సూస్కామె శిగమొచ్చినట్ల, వూగుకుంట -

అయ్యొ! కళమ్మ! దొంగ సన్నాసికూటికి ఆసపడి నీ కండ్లు గప్పి వొచ్చిండమ్మ, అంట అని, మళ్ల కుత్కెను యింగింత లాజిగ జేసి నాదిక్కు వుర్మకుంట -

ఎవడే బిచ్చగాడు? నీవు ఎవడంట బిచ్చం ఏస్తుండవె? నీమామకా? వూరిమీది బిచ్చగానికా? థూ, థూ, సొంతం యింటికి బిచ్చానికొచ్చి కోడలి ముంగల బిచ్చెమంట నెత్తి రుమాలవర్సిన బాబయ్య పెండ్లాన్ని తల్లి నేను! యాబాయిల వడ్డు, యా సావు సత్తు? కండ్లున్నందుకు ఏం జూడవడ్తి తల్లి! ఆఖరికి అడ్కతినె కాడ్కివొచ్చె బత్కు. మానం లేని బతుకు మంట్లెగలువ, అంట తామసం బట్టలేక బిర బిర వొచ్చి నా సేతుల గిన్నె గుంజుకోని నిలవడి,

థూ! నీ అత్కోరి బత్కుకు పాడుగాను అడుక్కతినెటోడవు సాపుగ అడుక్కోరాదు. మొకానికి ముసుకోలె దస్తి రుమాలెందుకు అడ్డం? కోడలి ముంగల కొంగు జాపినంక నీ బత్కెంత? నీ వెంత? నేనెంత? మన పెద్దిర్కె మెంత అంట మామను దుమ్మెదుల్పి నాదిక్కుదిర్గి

'' నీకెవడిచ్చిండు యీ అధికారం? నన్నడ్గకుండ నొచ్చినోడు బిచ్చెగాడా? తాగు వోతోడో? దొంగనో? దొరనొ? అంట జూడకుండ దాన దర్మాలు జేసి యాడ దట్టు కోకుండ వొక్క దమ్మెన సొర్గానికి నిచ్చెన ఏస్తనంట జూసినావ్? ఫో యీ బువ్వ దీస్కోని ఆకుడ్తికుండల వారేసిరా, అంట ఆమె అబిమానమంత నీరైపారంగ నిలదొక్కుకుంట ఆడిపులి తీర్గ వురిమింది.

అప్పుడు నాకు దెల్సివొచ్చింది, అట్ల సందెయాళ్ల, 'సందెకబుళం' తల్లీ అంట మా బంకుల ముందు నిలవడ్డ మనిషి అడుక్కతినె బిచ్చెగాడు గాడు; ఈ ఇంటి యజమాని, మాఅత్తకు మొగుడు, నాకుమామ, నామొగణ్ణిగన్న తండ్రి అంట.

దెబ్బదిన్న పులితీర్గ గాండ్రు గాండ్రు మనుకుంట, నిప్పుదొక్కిన కోతి తీర్గ ఎగురుతున్న మా అత్తను జూసి మామామ ఇందాక తన మొకం గానకుండ దస్తి రుమాలు జుట్టుకున్న అడ్డం తొలిగిచ్చి తాను ఇంగో చిర్తగండోలె ఒక్కగంతుల చెంగు మంట కడ్పదాటి నా చేతులున్న అన్నంగిన్నెను అమాతం గుంజుకోని మా అత్త నెత్తిన బోర్లిచ్చిండు.

అదిజూసినంక నాకాళ్లు వొణుకవట్టినవి. నోరు ఎండుకపోవట్టింది. వీళ్లు ఇద్దరు ఏం జేస్తరా? ఏమైతరా ? అంటప్రాణం బుగులు వట్టింది. పసిపిల్ల తీర్గ నాకు దుక్కం ముంచుక రావట్టింది. ఇంగ ఏంజేసెటందుకు కాళ్లు సేతుల ఆడక నీవు యాదికి రాంగనె నీ యింటికి వొచ్చిన.

ఇప్పుడు మా ఇంట్ల రామరావణ యుద్ధం జరుగుతుండదా ? కాకపోతె నల్గుట్ల నగువాట్ల పరాశ్కం ఎందుకంట ? మాయత్త సల్లవడి మామామ దొరకు అన్నమే వొడ్డిస్తుండదా ? తెల్వదు గని నేనైతే తప్పిచ్చుకోని వొచ్చిన.

నిజంగ మా అత్తను జూస్తె పాపం అనిపిస్తది. ఆమె గుణం శనామంచిది. అదృష్టం గల్సి రాక గని లేకుంటే ? దేవుత అసోంటిది. ఇంగోదిక్కు పోంటి జూస్తె మామామ గుడంగ సొతాగ చెడ్డోడు గాడు.'దానదర్మం జేతం అనే బారిబుద్దేవుండది గని తాగితె మనిషిగాడు, దానికి తోడు వుల్టకర్సులు, లేనిపోని పోకడ, మంచం వున్నంత కాళ్లు జాపు కునే రకం గాదు.

మాయదారి తాగుడు ఆయినను వట్టిపేల్సి పిప్పి జేస్తుండది.'గుర్రంబోత పోత గూటం బీక్కపాయె' అన్నట్ల ఆయిన పాపానికి అన్నెం పున్నెం ఎర్గని ఇంటోళ్లం అందరం బలి అయ్యేటట్లవుండం.

నిజంజెప్తుండ అక్క ! ఈ చిత్రం జూసినంక దునియల సూడదగ్గ సిత్రం ఇంగోటి పుట్టదు అనిపిస్తుండది. ఈ చిత్రం తల్సుకుంటెనె పై అంత జల్లుమని పుల్కలు వొస్తుండవి. ఆఖరికి ఏడ్వాల్నో ? నగాల్నో ? ఇల్లుఇడ్సిపోవాల్నో ? యాదిదెలుస్తలేదు. తల్సుకున్నప్పుడల్ల అసయ్యం బుట్టుకొచ్చి వోకారం వస్తుండది. మా ఆయనను అడ్గకుండ, అత్తమామలకు దెల్వకుండ తల్లిగారింటికి ఎట్లవోదు ? ఏం మొకం బెట్టుక పోదు? అంట ఎత ఎళ్లవోసుకున్నది.

చంద్రకళ ముచ్చెట యిన్నంక నాకూ ఏంజేయాల్నో తోసక నీకాడికి వొచ్చిన, అత్తా ! నీ అనుభవంల యిసొంటికతలు ఎప్పుడన్న ఇన్నవా ? సూసినవ ? నాకేం జేయాల్నో ? సలాజెప్పు అన్నది. నామ్యానగోడలు శశి.

ఈకత, పురాగ కొత్త కత .అంత ఇన్నంక, నిజంగ సదువుకున్న తెల్వి ఏరే వుంటది. తానొక్కతె వుట్టిగట్టు కోని వూగకుండ, నల్గురు తన మనోళ్లంట, వాళ్ల మంచి

కోసం పాకులాడ్తరు. ఈ పిల్ల నాకండ్లు దెరిపిచ్చింది. అప్పుడు నేను-

నామ్యానగోడల్ని జూసి, బిడ్డా ఈయాళ్లకు చెంద్రకళను ఇంటికి దోలు, రేపు నేను వాళ్ల కాడికి వోయి, కళను మా శశిని వో వారం దినాలు మా ఇంట్లవుంచుకోవాలనుకున్న అంట దోలుకొస్త. వాళ్లు నా మాట మిగమీరరు. మన ఇంటికివొచ్చినంక అన్ని నేను జూస్త, వుపాయం యాదన్న దొర్కక పోతాది ? అంట సముదాయిచ్చిన.

నల్గురు ఆడోళ్లం జతై ఆలోచన జేసి నంక ఇంగ అనుకున్న పనికి కొల్కిపూస దొర్కినట్లె.